# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 329 | ఆదివారం, 27 జూలై 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




# దేశ రాజకీయాల్లో స్విగ్గీ పాలిటిక్స్

ఇది ప్రజాస్వామిక విలువలకు ప్రమాదకరం

విలువలతో కూడిన రాజకీయాలు కొనసాగాలి

ప్రజాస్వామ్యానికి సిద్ధాంతపరమైన రాజకీయాలే రక్షణ మార్గం


జైపాల్ రెడ్డి, పీవీ నరసింహారావు స్ఫూర్తితోనే మా పాలన

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

దేశ రాజకీయాల్లో ధన ప్రభావం పెరిగిపోతుండడం ప్రజాస్వామిక విలువలకు ప్రమాదకర పరిణామమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాంతాలను నమ్మిన, విలువలతో కూడిన రాజకీయాలు కొనసాగాలి కానీ ఇప్పుడు వేగంగా 'డెలివరీ' చేసే నేతలను వెతికే 'స్విగ్గీ పాలిటిక్స్' ట్రెండ్ పెరిగిందని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రమాదకరమని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ, ఐసీఎఫ్ఏఐ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి పేరుతో నెలకొల్పారు. ఈ అవార్డును ప్రముఖ రచయిత మోహన్ గురుస్వామికి సీఎం రేవంత్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "జైపాల్ రెడ్డి విద్యార్థి నాయకుడిగా మొదలుకుని మిగతా 2లో..

# బీసీలకు ఎవరు ఏం చేశారు?



బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఫైర్

బీజేపీ బీసీలకు ఏం చేసిందో చెబుతా..

గణాంకాలతో నేను చర్చకు వస్తాను

ఎక్కడ రమ్మంటారో టైమ్, ప్లేస్ చెప్పండి

కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గం మళ్ళీ ఏర్పాటు చేయాలి

మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు. గత మూడు రోజులుగా ఎక్కడ చూసినా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రఘునందన్ రావు ధ్వజమెత్తారు. "నాలుగున్నర దశాబ్దాలలో బీజేపీ బీసీలకు ఏం చేసిందో నేను చెబుతా. మరి బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో పీసీసీ చీఫ్, విప్ ఆది శ్రీనివాస్ చెబుతారా?" అని రఘునందన్ రావు సవాల్ విసిరారు. తాను గణాంకాలతో చర్చకు వస్తానని, ఎక్కడ రమ్మంటే అక్కడ వస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గం మళ్ళీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉంటే ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం కరెక్టేనా ఆది సీనన్నా?" అని ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ 250 మందిని ముఖ్యమంత్రులను చేస్తే అందులో 43 మంది మాత్రమే ఓబీసీలు ఉన్నారని తెలిపారు. అదే బీజేపీ 68 మంది ముఖ్యమంత్రులను చేస్తే అందులో 21 మంది ఓబీసీలు మిగతా 2లో..

## అన్యాయం జరిగితే 'జాగృతి' ఊరుకోదు

తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం

వచ్చాక ప్రజల అభివృద్ధి కోసం పాటుపడ్డాం

ఎమ్మెల్సీ కవిత కీలక

జాగృతి ఆధ్వర్యంలో 'లీడర్' శిక్షణ కార్యక్రమం



02

## కేసీఆర్‌లా విజృంభించాలి

కాంగ్రెస్ కుట్రలను అర్థం చేసుకోవాలి

కేసీఆర్ హయాంలో సంక్షేమంలో స్వర్ణయుగం

మేడిగడ్డ బరాజ్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ పాలనలో ఒక్కో ప్రాజెక్టు 40 ఏళ్లు కట్టారు

ముఖ్యమంత్రి రేవంత్ హామీలు ఎగ్గొట్టి మోసం చేశారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




02

## పదోన్నతులకు పచ్చజెండా

ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ప్రభుత్వం ఆమోదం

ఎస్టీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే ఛాన్స్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రానున్నాయి. దీనికి సంబంధించి రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌లుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది మిగతా 2లో..


## నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి

కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తోంది

చంద్రబాబు, రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహులు

గురుశిష్యులు కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారు

బీఆర్ఎస్వీ సభలో మాజీ మంత్రి హరీశ్ రావు హాట్ కామెంట్స్




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఉప్పల్‌లో జరిగిన బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి విద్యార్థి సదస్సులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ నేతలలో ఉత్సాహం నింపేలా మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన, కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. హరీష్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నిద్రలో కూడా కేసీఆర్ కనిపిస్తున్నాడు. ఎప్పుడూ జై మోదీ, జై ఢిల్లీ అంటున్నాడు.. కానీ, ఒక్కసారి కూడా జై తెలంగాణ అనడం లేదని విమర్శించారు. ఇది ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం అంటూ మండి పడ్డారు. రేవంత్ రెడ్డి, మిగతా 2లో..



## తెలుగు రాష్ట్రాల్లో 'సృష్టి' ప్రకంపనలు

పుట్టిన బేబీకి క్యాన్సర్ రావడంతో దంపతులకు అనుమానం

డీఎన్ఏ పరీక్షలు చేయడంతో వీర్యం తమది కాదని నిర్ధారణ

సరోగసి కోసం పెద్ద ఎత్తున్న వీర్యం నిల్వ

పోలీసుల అదుపులో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ డాక్టర్

వైజాగ్, విజయవాడలోని సెంటర్లలో పోలీసుల సోదాలు

02



# అన్యాయం జరిగితే 'జాగృతి' ఊరుకోదు

- తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం
- వచ్చాక ప్రజల అభివృద్ధి కోసం పాటుపడ్డాం
- ఎమ్మెల్సీ కవిత కీలక
- జాగృతి ఆధ్వర్యంలో 'లీడర్' శిక్షణ కార్యక్రమం

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడర్' శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని అన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ''ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేదు.

సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి. పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యేగానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే 'జాగృతి' పని చేస్తుంది.

తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదు'' అని కవిత అన్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో 'సృష్టి' ప్రకంపనలు

- పుట్టిన బేబీకి క్యాన్సర్ రావడంతో దంపతులకు అనుమానం
- డీఎన్ఏ పరీక్షలు చేయడంతో వీర్యం తమది కాదని నిర్ధారణ
- సరోగసి కోసం పెద్ద ఎత్తున్న వీర్యం నిల్వ
- పోలీసుల అదుపులో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ డాక్టర్
- వైజాగ్, విజయవాడలోని సెంటర్లలో పోలీసుల సోదాలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై సంచలనం రేగుతోంది. ఒక చిన్నారికి క్యాన్సర్ రావడంతో తల్లిదండ్రులకు కలిగిన అనుమానం, ఆసుపత్రి నిర్వాకం వెనుక ఉన్న దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. పుట్టిన బిడ్డ తమ వీర్య కణాలతోనే కలిగిందా లేదా అనే అనుమానం డీఎన్ఏ పరీక్షలతో నిజమైంది. ఇది పెద్ద ఎత్తున అక్రమాలకు, అనైతిక పద్ధతులకు అద్దం పడుతోంది. టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం సృష్టి సెంటర్‌ను ఆశ్రయించిన దంపతులకు మగబిడ్డ పుట్టాడు. అయితే, బిడ్డ ఎదుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. కొన్ని రోజుల క్రితమే బాబుకు క్యాన్సర్ అని తేలడంతో దంపతులు షాక్‌కు గురయ్యారు. దీంతో మరో డాక్టర్‌ను సంప్రదించి డీఎన్ఏ టెస్ట్ చేయించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బిడ్డ డీఎన్ఏ తమ వీర్యకణాలతో సరిపోలడం లేదని, మరొకరి వీర్య కణాలను ఉపయోగించి సంతానం కలిగించినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆగ్రహించిన దంపతులు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయించారు. సికింద్రాబాద్‌లో కేసు నమోదైన వెంటనే, వైజాగ్‌లో ఉన్న సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌లో కూడా పోలీసులు దాడులు నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖల ఉన్నతాధికారులు రెండు గంటలకు పైగా తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో అక్రమంగా పెద్ద ఎత్తున వీర్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. కొందరు యువకులకు డబ్బు ఆశ చూపి అక్రమ పద్ధతిలో వీర్యం సేకరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారానికి కీలక సూత్రధారిగా భావిస్తున్న డాక్టర్ నమ్రత ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నట్లు తెలిసింది. ఎవరైనా దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం వస్తేనే, విజయవాడ నుంచి వచ్చి చికిత్సలు అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం టాస్క్ ఫోర్స్ పోలీసులు డాక్టర్ నమ్రతను విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు తీసుకువచ్చారు. సంతానం కోసం ఆశపడే దంపతుల నమ్మకాన్ని ఆసరా చేసుకొని వారి జీవితాలతో చెలగాట మాడుతున్న ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఫర్టిలిటీ క్లినిక్‌ల పారదర్శకత, నియంత్రణపై మరోసారి చర్చను రాజేసింది.

# కేసీఆర్‌లా విజృంభించాలి

- కాంగ్రెస్ కుట్రలను అర్థం చేసుకోవాలి
- కేసీఆర్ హయాంలో సంక్షేమంలో స్వర్ణయుగం
- కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు
- మేడిగడ్డ బరాజ్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- కాంగ్రెస్ పాలనలో ఒక్కో ప్రాజెక్టు 40 ఏళ్లు కట్టారు
- ముఖ్యమంత్రి రేవంత్ హామీలు ఎగ్గొట్టి మోసం చేశారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కొందరి గొంతులు లేస్తున్నాయని కేటీఆర్ అన్నారు. వాళ్లను అడ్డుకోవడానికి మనకు ఉన్న అస్త్రం సోషల్ మీడియా అని తెలిపారు. ఒక్కొక్కరూ ఒక్కో కేసీఆర్‌లా విజృంభించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో సంక్షేమంలో స్వర్ణయుగంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 73 వేల కోట్లు రైతుబంధు రూపంలో అన్నదాతలకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రతి యూనివర్సిటీలో విద్యార్థులు పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ విద్యార్థుల పోరాట ప్రతిమను దేశం గుర్తించిందని తెలిపారు. తెలంగాణ కోసం ఎంతోమంది అమరులయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ సారథ్యంలో సబ్బండ వర్గాలు కదం తొక్కాయని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ అద్భుతంగా పరిపాలించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో మోదీ సర్కార్ మనల్ని ఎంతో ఇబ్బంది పెట్టిందని కేటీఆర్ అన్నారు. ఎవరి కోసం ఎదురుచూడకుండా అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు తిరుగులేకుండా పోయిందని చెప్పారు. అప్పుడు తెలంగాణకు కేంద్రంలోని మోదీ సర్కార్ సహకరించలేదని తెలిపారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని కేసీఆర్ ఎదురుచూడలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 12వ స్థానంలో ఉన్న తెలంగాణను వ్యవసాయంలో అగ్రగామిగా నిలబెట్టామని తెలిపారు. తలసరి ఆదాయంలో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపామని చెప్పారు. రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

**ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం**

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు అని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలో హిమాలయాలంత ఎత్తుకు తెలంగాణను కేసీఆర్ తీసుకెళ్లారని పేర్కొన్నారు. నాలుగేళ్లలో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ ప్రాజెక్టు కాళేశ్వరం అని అన్నారు. కాళేశ్వరం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు, వేల గ్రామాలకు తాగునీరు అందించామని చెప్పారు. కాళేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా ఏర్పాటు చేశామని వివరించారు. చివరి ఆయకట్టు వరకు నీళ్లిచ్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ఒక్కో ప్రాజెక్టు 40 ఏళ్లు కట్టారని తెలిపారు. కానీ ఈ ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేశాయని మండిపడ్డారు. 80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుందని.. అసెంబ్లీలో నిలదీయడంతో కాంగ్రెస్, బీజేపీ మాట మార్చాయని తెలిపారు.

**ఎవర్ని ఉరితీయాలి**

మేడిగడ్డ బరాజ్‌పై కూడా కాంగ్రెస్ వాళ్లు కుట్రలు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ అంటే.. దుడ్డెను కట్టేయమన్నట్లు బీజేపీ వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎక్స్‌పాన్షన్ జాయింట్ల దగ్గర వెడల్పయితే కూలిందని ప్రచారం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డ బరాజ్‌లోని 85 పిల్లర్లలో రెండు కొంచెం కుంగితే కూలిందని ప్రచారం చేశారని విమర్శించారు. శతాబ్దాలుగా ఎప్పుడు రానంత వరద వచ్చినా మేడిగడ్డకు ఏం కాలేదని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి రోజూ మాట్లాడతారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కట్టినోళ్లను ఉరితీయాలని అంటున్నారని మండిపడ్డారు. మీలెక్క 40 ఏళ్ల కట్టనందుకు ఉరితీయాలా అని ప్రశ్నించారు. మీలెక్క రైతులకు నీళ్లు ఇవ్వనందుకు ఉరితీయాలా అని నిలదీశారు. ఫ్లోరోసిస్ వ్యాధితో నల్గొండలో పిల్లలు పుట్టకుండా చంపేసినందుకు కాంగ్రెస్ వాళ్లను ఏం చేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. దశాబ్దాలుగా ప్రాజెక్టులను పడావు పెట్టినందుకు కాంగ్రెస్ నేతల్ని ఉరితీయాలని అన్నారు.

**కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి**

రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. అన్నీ తెలిసే అధికారం కోసం కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు తీసేస్తే రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని రేవంత్ రెడ్డి అన్నాడని గుర్తుచేశారు. 25 లక్షల కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని నమ్మబలికారని అన్నారు. చివరకు అన్ని హామీలు ఎగ్గొట్టి మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

**మిత్తితో సహా జవాబు చెబుతాం..**

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల తీరుపై వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులను ఉద్దేశించి అన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మిత్తితో సహా జవాబు చెబతామని హెచ్చరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్టయి పోలీస్ స్టేషన్‌లో ఉంటే ఆయనింటికి పోలీసులు వెళ్లారని కేటీఆర్ తెలిపారు. గెల్లు భార్య ఫోన్ ఇవ్వనని చెప్పినందుకు ఆమెపై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టారని మండిపడ్డారు. అసలు పోలీసులకు మెదడు ఉందా? చదువుకున్నారా? లేదా అని ప్రశ్నించారు. నల్లబాలు రీట్వీట్ చేసినందుకు 20 రోజులు జైలుకు పంపించారని చెప్పారు. రాహుల్ గాంధీ చెప్పే మొహబ్బత్ కా దుఖాన్ ఇదేనా అని నిలదీశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. రేవంత్ రెడ్డికి బానిసలా పనిచేస్తున్న అధికారులను హెచ్చరించారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని.. మిత్తీతో సహా జవాబు చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. మూసీలో లక్షన్నర కోట్ల కుంభకోణం బయట పెడితే సీఎం రేవంత్ రెడ్డి లాగు తడిసిందని అన్నారు. మనం పోరాటం చేస్తేనే మూసీ కుట్రలు ఆగాయని చెప్పారు. లగచర్లలో రేవంత్ రెడ్డి అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. లగచర్ల ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములపై పోరాటం చేసింది విద్యార్థులేనని అన్నారు. మీ పోరాటాలకు మన లీగల్ సెల్ అండగా నిలిచిందని తెలిపారు. పోరాడిన వారికే రాజకీయంగా అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. లీగల్ సెల్ ద్వారా జిల్లాల వారీగా విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

# దేశ రాజకీయాల్లో 'స్విగ్గీ పాలిటిక్స్' ట్రెండ్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర మంత్రిగా పలు పదవుల్లో అత్యుత్తమ సేవలందించారు. సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నేతగా ఆయన్ను దేశ రాజకీయాలు గుర్తించాయి. ఆయన విధాన నిర్ణయాలు, మీడియా స్వేచ్ఛకు అంకితంగా తీసుకొచ్చిన ప్రసార భారత చట్టం ప్రజాస్వామ్యానికి శక్తిని జోడించాయి," అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్రను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా గుర్తు చేశారు. "వారి చొరవ లేకపోతే తెలంగాణ సాధన ఈ విధంగా జరిగేది కాదు. రాజ్యసభలో సవరణలు ప్రతిపాదించడంలోనూ, కేంద్ర మంత్రి వర్గంలో తెలంగాణ బిల్లును ఆమోదించించడంలోనూ ఆయన పాత్ర మరువలేనిది," అని అన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో సిద్ధాంతపరమైన నేతలు తగ్గిపోతున్నారని సీఎం అభిప్రాయపడ్డారు. "ఇప్పుడు కార్యకర్తలు తగ్గిపోతూ వాలంటీర్లు పెరుగుతున్నారు. రాజకీయాలన్నవి మేనేజ్‌మెంట్‌గా మారుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే దిశగా తీసుకెళ్తోంది," అని వ్యాఖ్యానించారు. సిద్ధాంతాలపై నమ్మకంతో విద్యార్థి నాయకత్వం ఏర్పడాలి అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. "ధన ప్రభావం తగ్గి, విలువలతో కూడిన భిన్నాభిప్రాయాలు ఉన్న రాజకీయ పద్ధతులు స్థిరపడాలి. అప్పుడే ప్రజాస్వామిక స్ఫూర్తిని నిలబెట్టుకోగలుగుతాం," అని తెలిపారు. జైపాల్ రెడ్డి, పీవీ నరసింహారావు వంటి మహానేతల స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.



# బీసీలకు ఎవరు ఏం చేశారు?

మొదటిపేజీ తరువాయి

ఉన్నారని పేర్కొన్నారు. అంటే, "బీజేపీ 31 శాతం ఓబీసీలను సీఎంలుగా చేసింది, కాంగ్రెస్ పార్టీ 17 శాతం మందిని మాత్రమే సీఎం చేసింది" అని వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారని గుర్తు చేశారు. బీజేపీకి బండి సంజయ్ ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్‌డీఏ కూటమిలో 20 మంది ముఖ్యమంత్రులు ఉంటే ఐదుగురు ఓబీసీలు, ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు మైనార్టీలు ముఖ్యమంత్రులుగా ఉన్నారని తెలిపారు. మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో కేవలం ఇద్దరు ఓబీసీలు మంత్రులుగా ఉంటే, మోడీ క్యాబినెట్‌లో 21 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని గణాంకాలు చెప్పారు. దేశానికి రాష్ట్రపతిగా దళితులను, గిరిజనులను చేసిన ఘనత బీజేపీదని రఘునందన్ రావు అన్నారు. తెలంగాణకు రెండు కేంద్ర మంత్రి పదవులు ఇస్తే, అందులో ఒక బీసీకి మంత్రి పదవి ఇచ్చామని గుర్తుచేశారు. కేటీఆర్, ఎంపీ సీఎం రమేష్ ఎపిసోడ్ పై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కేటీఆర్ బీజేపీ ఎంపీలపై "బట్ట కాల్చి మీద వేశాడని" మండిపడ్డారు. హెచ్‌సీయూ విషయంలో కేటీఆర్ మొదట కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తనపై ఆరోపణలు చేశారని రఘునందన్ రావు గుర్తుచేశారు.




# పదోన్నతులకు పచ్చజెండా

మొదటిపేజీ తరువాయి

సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఈమేరకు పదోన్నతి ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల మల్టీజోన్ 2లో మిగిలిపోయినవి, పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి వీటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది.

పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు. అదేవిధంగా డీఎస్సీ 2012 తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ఇలా దాదాపు 2 వేల మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను ఆధారంగా తీసుకుని ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.





# నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి

మొదటిపేజీ తరువాయి

కిషన్ రెడ్డి లాంటి నాయకులు ప్రజల బాటలో లేరని, రాజీనామా చేయకుండా పక్కకి నడిచారని గుర్తుచేశారు. రాజీనామా చేయమంటే జిరాక్స్ పేపర్ ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు.

తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తిచూపే బదులు, దాన్ని మరుగున పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ద్రోహుల జాబితాలో మొదటి పేరు చంద్రబాబు, రెండవ పేరు రేవంత్ రెడ్డిదే రాయాలి అంటూ హాట్ సిమెంట్స్ చేశారు. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తోందని ఆయన ఆరోపించారు. రేవంత్ పాలనలో తెలంగాణ తల్లి, కాకతీయ తోరణాన్ని, ఉద్యమ జ్ఞాపకాలను తొలగించడమే ముఖ్య లక్ష్యంగా మారిందని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి దండ కూడా వేయని వ్యక్తి సీఎం అయ్యాడు అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంకా హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ గొప్ప విజనరీ నాయకుడు. ఆయన ఎప్పుడూ కక్ష రాజకీయాలు చేయలేదు. కానీ, రేవంత్ మాత్రం ప్రతి విషయంలో వ్యక్తిగత కక్షతో వ్యవహరిస్తున్నాడు అని విమర్శించారు. ఈ పాలనలో నీళ్లు ఆంధ్రాకు పోతున్నాయి.. నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయి. చంద్రబాబుకి నీళ్లు, రాహుల్ గాంధీకి నిధులు వెళ్లేలా రేవంత్ పాలన సాగుతోంది అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ గురు శిష్యులు కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్న తీరును ప్రజలకు వివరిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.



## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట,(ప్రజాస్వరం) :

జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా ఆయా గ్రామాల్లో స్వీకరించిన అప్లికేషన్ లను యుద్ధ ప్రాతిపాదికన డిస్పోజల్ చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు, తాసిల్దారులు భూభారతి స్పెషల్ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కొరకు శాశ్వత పరిష్కారం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. భూ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో విజయవంతంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రజల నుంచి భూ సమస్యల పై వచ్చిన దరఖాస్తులను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు సదానందం, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## వంతెనను సందర్శించిన ఆర్డీవో

మెదక్, జూలై 26 (ప్రజా స్వరం) : హవేలీ ఘనపూర్ మండలం దూప్ సింగ్ తాండా వాగు ను ఆర్డీవో రమాదేవి సందర్శించారు. అక్కడ భారీగా నీరు వచ్చి చేరడంతో వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో వంతెన దగ్గర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో సింధు రేణుక సూచించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆర్డీఓ ఆదేశించారు.

## గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా: శేఖర్ రెడ్డి



తూప్రాన్ / మనోహరాబాద్ (ప్రజాస్వరం) :

గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని మాజీ సర్పంచి శేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ప్రభావతి పెంటన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వైకుంఠ రథం, విధి దీపాలు, రోడ్లు, సీసీ కెమెరాలు తన సొంత ఖర్చుతో చేస్తునన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పెద్దలు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. గ్రామ పెద్దలు ఎలక్షన్ రెడ్డి, నర్సింలు, సత్యనారాయణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన పేదల కల

## 45 వేల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ

### యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





తూప్రాన్ / మనోహరాబాద్ ( ప్రజాస్వరం ) :

నిరుపేద కుటుంబాలకు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నకొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఇప్పుడు నెరవేరిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ అనంతరం తెలంగాణ రైతు అగ్రోస్ సేవా కేంద్రమును తనిఖీ చేసిన కలెక్టర్ తూప్రాన్ ఎంపీడీవో కార్యాలయంలో ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, తహసీల్దార్ సంబంధిత రెవిన్యూ అధికారులు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 45 వేల కుటుంబాలు కొత్త రేషన్ కార్డులు మరియు కొత్త కుటుంబ సభ్యుల చేరిక ద్వారా లబ్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో వర్షాకాలం ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల రేషన్ ఒకేసారి అందించడం జరిగిందన్నారు. ఈరోజు ప్రభుత్వం అందించిన సన్న బియ్యాన్ని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ సంతోషంగా ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజా పాలన గ్రామ సభలో సపరేటుగా రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా అర్హత మేరకు అందించడం జరిగింది అన్నారు మీ సేవలో చేసుకున్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకున్నామన్నారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా ఎంక్వైరీ నిర్వహించి అర్హత ఉన్నవారికి ఆహార భద్రత కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులలో పేర్లు చేర్చే ప్రక్రియ జరిగిందన్నారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు.అనంతరం కలెక్టర్ మున్సిపాలిటీలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ను ఆయన పరిశీలించారు.జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కలెక్టర్ స్పష్టం చేశారు. రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలకరించి, సరిపడా ఎరువులు అందుతున్నాయా అని ఆరా తీశారు.జిల్లావ్యాప్తంగా యూరియా సరిపడా అందుబాటులో ఉంచామని ఎక్కడా కొరత లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన జిల్లా వ్యాప్తంగా ఎరువుల పురుగు మందుల దుకాణాలను రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ సమన్వయంతో జాయింట్ యాక్షన్ టీమ్స్ ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. సిఫిజికల్ స్టాక్ ,ఈపాస్ మిషన్ ద్వారా తనిఖీ ప్రైవేట్ , ఫ్యాక్స్ డీలర్స్ యూరియా బ్లాక్ మార్కెట్స్ కు తరలిపోకుండా ఎంక్వైరీ చేయడం జరిగిందన్నారు. ఎంక్వయిరీలో జిల్లాలో ఎక్కడా కూడా ఇటువంటి సంఘటనలు జరగటలేదని నిర్ధారణ అయిందని కలెక్టర్ చెప్పారు.జిల్లాలో ఇంకనూ జూలై నెలలో రైతులకు ఎంత మేరకు అవసరం ఉంటుందో అంతకుమించి యూరియా నిల్వ ఉందన్నారు. ఆగస్టు మాసానికి సంబంధించి ముందుగా ప్రతిపాదన పంపించగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ముందుగానే యూరియా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత తలెత్తకుండా పర్యవేక్షణ చేస్తున్నామని భరోసా కల్పించారు.






# ఎందుకింత అధ్వానమైన రోడ్లు?

### బీజేపీ పటాన్‌చెరువు మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా

పటాన్ చెరువు జులై 26 (ప్రజాస్వరం) :

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలో అధ్వానంగా మారిన రోడ్లు భారతీయ జనతా పార్టీ పటాన్చెరు మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. పటాన్ చెరువు రింగ్ రోడ్ నుండి దౌల్తాబాద్ వరకు జిన్నారం మండలం నుండి గుమ్మడిదల్ వరకు ఇంద్రేశం నుండి వెళ్లే వాహనదారులకు చాలా ఇబ్బందిక రంగా మారిన ఇంద్రేశం రోడ్లు స్థానిక ఎమ్మెల్యే గత 12 సంవత్సరాల నుంచి అధికారంలో ఉండి కూడా ఈ ముఖ్యమైన రహదారిని నిర్మించలేకపోతున్నారు. ఎందుకింత అద్వానమైన రోడ్లు? ఎన్నిసార్లు వేసిన పాడవడానికి ముఖ్య కారణం క్రషర్ల నుంచి వచ్చే భారీ వాహనాలు ఈ రోడ్లను పాడు చేస్తా ఉన్నాయ్ ఇటు ఆటోవాలా కూడా రోజు రిపేర్లకే వచ్చిన డబ్బులు సరిపోతున్నాయి వాళ్ళ జీవనం ఇలా కొనసాగుతుంది అని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఈ రోడ్డును మరమ్మతు చేయకుండా ఇలాగే వదులుతే ఆఖరికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇల్లును ముట్టడిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రతాపరెడ్డి పటాన్ చెరువు మండల అధ్యక్షులు కావలి వీరేశం గుమ్మడిదల మండల అధ్యక్షులు ఐలేష్, జిన్నారం మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి,రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు మరియు మహిళ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.




### మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

## కల్లూరి హనుమంతరావు

మెదక్ జూలై 26 (ప్రజా స్వరం) :

రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా మెదక్ జిల్లాకు చెందిన కల్లూరి హనుమంతరావు పటేల్ నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావు పటేల్ నియామక పత్రాన్ని అందజేశారు. తన ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడితో పాటు సంఘ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతరావు పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపుల బలోపేతాని కృషి చేస్తానన్నారు. హన్మంతరావు నియామకం పట్ల ప్రముఖ నేతలు, సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్




## ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా
# జాగ్రత్తలు వహించాలి
## అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**శామీర్ పేట జూలై 27(ప్రజా స్వరం) :**

శామీర్ పేటలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను తూముకుంట మునిసిపల్ కమిషనర్ జ్యోతి ఇంచార్జ్ డిడబ్ల్యూ శారద కలసి అదనపు కలెక్టర్ సందర్శించారు. పాఠశాలకు ఎంతమంది రోజు హాజరవుతున్నారు, విద్యా బోధన విధానాలనుపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ఆమె ముచ్చటించారు ,భారీగా వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారము నాణ్యమైన ఆహారం అందించుటకు రాజీ పడద్దని వారికి సూచించారు, పాఠశాల గదులను, వంటగదిని, పాఠశాల పరిసరాలను కలియ తిరిగి ఆమె పరిశీలించారు.పాఠశాలకు పలు మరమ్మత్తులు నిర్వహించాలని ఉపాధ్యాయులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా , మరమ్మత్తులకు కావలసిన నిధుల కోసం ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పాఠశాల పరిసరాలలో అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు ఒక గదిని కేటాయించాలని విద్యాశాఖ అధికారులకు అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.



# దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు**
**కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని**
**బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలి**
**భారత మాజీ ఆర్మీ జవాన్లకు ఘన సన్మానం**



**జడ్చర్ల జూలై 26 (ప్రజా స్వరం) :**

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మండలంలో బీజేవైఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలి నిర్వహించారు. ఈ ర్యాలి లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. అనంతరం భారత మాజీ ఆర్మీ జవాన్లను సన్మానించారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన భారత వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సేవలో, రక్షణ కోసం సేవలందించిన మాజీ ఆర్మీ జవాన్లను సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, జిల్లా అధ్యక్షులు అలాగే ప్రతి బీజేవైఎం కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లోరామచంద్ర రావు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం వీరోచితంగా పోరాడి, తమ పరాక్రమంతో పాకిస్తాన్ కు ముచ్చెమటలు పట్టించి, కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించేందుకు వీరమరణం పొందిన అమరవీర జవాన్లకు మా ఘన నివాళులు అర్పించారు.1999లో కార్గిల్ ప్రాంతం నుంచి పాకిస్తాన్ ఉగ్రవాదులు మరియు చొరబాటుదారులు భారత దేశంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఇది భారతదేశంపై పాకిస్తాన్ చేసిన ఘోరమైన కుట్ర.ఈ దాడిని భారత సైన్యం ధైర్యంగా ఎదుర్కొంది. అప్పటి ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో భారత సైన్యం ఓ మహత్తర విజయాన్ని సాధించింది. శత్రువులను తిప్పికొట్టి, కార్గిల్ లోని భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ యుద్ధంలో మన సైనికులు ప్రాణ త్యాగాలు చేశారు. వారి ధైర్యం, వీరత్వం ఎప్పటికీ మరువలేనివి.ఈ రోజు దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మరియు భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మళ్లీ ఒకసారి భారత వీరజవాన్ల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నాం. ఈ వేళ, చిన్నపిల్లలు కూడా పాల్గొంటూ దేశభక్తిని వ్యక్తపరుస్తున్నారు. భారత సైన్యం చేసిన త్యాగానికి గుర్తుగా, మనం జరుపుకుంటున్న కార్గిల్ విజయ దినోత్సవం భారత సైనిక వీరత్వానికి నిదర్శనం. ఇటీవల జరిగిన సర్జికల్ స్ట్రైక్‌లు, వైమానిక దాడులు, ఇతర ఆపరేషన్‌లు ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికే.పాకిస్తాన్ మళ్లీ మామూలుగా దాడి చేయగలిగే స్థితిలో లేదు. కానీ పరోక్షంగా ఉగ్రవాదుల ద్వారా భారత్‌పై దాడులు చేస్తున్నాయి. కానీ ఈ దేశం ఇప్పుడు మారిపోయింది. సైనికులే కాదు..ఈ దేశపు ప్రతి యువకుడు, ప్రతి పౌరుడు దేశాన్ని రక్షించేందుకు సిద్ధంగా ఉన్నారు.ఈ కార్గిల్ విజయ దినోత్సవం మన యువతలో ఉత్సాహాన్ని, జాతీయతను పెంపొందించే అవకాశంగా ఉండాలన్నారు.


## మహిళా సంఘాలకు సర్కార్ బాసట



**శామీర్‌పేట, జూలై 27(ప్రజా స్వరం) :**

స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. శనివారం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో మహిళ శక్తి గ్రూపులచే ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మునిసిపల్ కమిషనర్ జ్యోతితో కలిసి ఆమె సందర్శించి, స్టాళ్లలో ఏర్పాటుచేసిన పలు వంటకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం చేయుటకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తుందని ఆమె తెలిపారు, ఇందులో భాగంగా మహిళా శక్తి గ్రూపులకు క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు, ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లను ఆమె పంపిణీ చేశారు. వర్షాకాలం అయినందున పరిశుద్ధ కార్మికులు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు, మేడ్చల్ ఆర్టీఏ మెంబర్ బిమిడి జైపాల్ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.






# వేధింపుల కేసులో జాప్యం తగదు

## జస్టిస్ అభినందన్ కుమార్ షామిలి

**మేడ్చల్, జూలై 26( ప్రజాస్వరం ) :**

మహిళలపై వేధింపుల కేసులను సామాజిక సమస్యగా చూసి త్వరగా పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, విజయసేన్ రెడ్డిలు సూచించారు. అత్వేలి కోర్టు ప్రాంగణం నుంచి మేడ్చల్ కోర్టు ప్రాంగణంలోకి తరలించిన 8వ ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, 10వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నూతన భవనాలకు భవనాలకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్ షావిలి, జస్టిస్ విజయసేనారెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ భవనాలను రూ. 90 లక్షలతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడుతూ వేధింపులకు గురైన బాధితులను పలుమార్లు కోర్టులకు తిప్పకుండా వెంటనే కేసులను పరిష్కరించాలని న్యాయవాదులకు సూచించారు. సమాజంలో న్యాయవాద వృత్తి అత్యంత పవిత్రమైందని, దాన్ని సక్రమంగా నిర్వహించి గౌరవప్రదంగా జీవించాలన్నారు. న్యాయవాదులు చిత్తశుద్ధితో పనిచేస్తే కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు తగ్గుతాయని పేర్కొన్నారు. యువ న్యాయవాదులు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చారని, వారు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ కృషితో భవనాలు మేడ్చల్ ప్రాంగణంలోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి ఎస్ ఎన్ శ్రీదేవి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, కార్యదర్శి విజయ గోపాలరావు, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, జాయింట్ సెక్రెటరీ అప్సర్, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవం




**శామీర్ పేట జూలై 27(ప్రజా స్వరం) :**

ఘనంగా తుర్కపల్లిలోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్లో శనివారం కార్గిల్ విజయం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, భారత సైనికుల వీరత్వం, త్యాగం గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి రెడ్డి హాజరై, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం విశేషాలు, భారత సైనికుల పోరాట స్ఫూర్తి గురించి వివరించారు. దేశభక్తి భావనను పెంపొందించుకోవాలని విద్యార్థులను ప్రేరేపించారు. పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి భారత సైనికుల సేవలను స్మరించుకుంటూ, దేశాన్ని కాపాడటానికి వారు చేసిన త్యాగాలు ఎంతో గౌరవనీయమని అన్నారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు ప్రదర్శించి, భారత త్రివర్ణ పతాకాన్ని అలరారించారు. కొంతమంది విద్యార్థులు కార్గిల్ యోధుల జీవిత చరిత్రలపై ప్రసంగాలు చేయగా, మరికొందరు దేశభక్తిని ప్రదర్శించే నాటికలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పాఠశాల ఇంచార్జ్ గ్రేస్ రెడ్డి, గౌసియా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.



## దాక్షాయణి రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా రాధాకృష్ణ

**మేడ్చల్,(ప్రజాస్వరం):**

మేడ్చల్ పట్టణంలోని శ్రీ దాక్షాయని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త, చైర్మన్ గా దాత్రిక రాధాకృష్ణను కొనసాగిస్తూ ఎండోమెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో దేవాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం దాత్రిక రాధాకృష్ణను ఆలయ ధర్మకర్త, చైర్మన్ గా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ ప్రణీత్, ఆలయ ఈవో కృష్ణమాచార్యులు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ ద్రాక్షాయని సమేత రామలింగేశ్వర దేవస్థాన ధర్మకర్తగా, చైర్మన్ గా దాత్రిక రాధాకృష్ణ కొనసాగుతారని వారు వెల్లడించారు. ఆలయానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ దాత్రిక రాధాకృష్ణ ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అయ్యప్ప, కార్తీక్ లు రాధాకృష్ణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దాత్రిక శ్రీనివాస్ మూర్తి ( బాబ్జీ), కమిటీ సభ్యులు రుద్ర జనార్ధన్, శ్రీనివాస్ చారి, తోట రాజు, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్, నర్సింగరావు, జలంధర్ రెడ్డి, కార్తీక్, శివాజీ, ఆకాష్ పాల్గొన్నారు.



# వర్షాకాలం.. పెరుగుకు దూరం

## ఆయుర్వేదం ఏం చెబుతుందో తెలుసా?



వర్షా కాలం ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో, ఆరోగ్యానికి కూడా అంతే హానికరం. ఎందుకంటే ఈ కాలంలో వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. ప్రజలు త్వరగా అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. అందుకే వర్షా కాలంలో తినే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వర్షా కాలంలో జబ్బుల బారిన పడుకుండా ఉండాలంటే ఏం తినాలో, ఏం తినకూడదో ఓ అవగాహన ఉండాలి. ఇక, సాధారణంగా పెరుగు ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. అయితే, వర్షా కాలంలో పెరుగు తినకూడదని ఆయుర్వేదం చెబుతుంది. ఈ సీజన్‌లో పెరుగు తింటే వివిధ ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. వర్షా కాలంలో పెరుగు ఎందుకు తినకూడదు, తింటే ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఆయుర్వేదం ఏం చెబుతుంది?**

సాధారణంగా భోజనం లేదా ఇతర రుచికరమైన వంటకాలతో పాటు ఒక గిన్నె పెరుగు తినడం చాలా మందికి ఉన్న అలవాటు. అయితే, వర్షాకాలంలో పెరుగు తినడం వల్ల వాత, పిత్త, కఫ వంటి మూడు దోషాలు ఒకేసారి ప్రభావితమవుతాయి. ఇది అందరికీ మంచిది కాకపోవచ్చని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఆయుర్వేదం ప్రకారం వర్షాకాలంలో వాత, పిత్త దోషాలు తరచుగా తీవ్రమవుతాయి. ఇది శరీరాన్ని దుర్బలంగా మారుస్తుంది. దీంతో సీజనల్ వ్యాధులు వస్తాయని నిపుణులు అంటున్నారు. వర్షాకాలంలో పెరుగు ఎందుకు తినకూడదో ఇప్పుడు చుద్దాం.

**జీర్ణసమస్యలు**

ఆయుర్వేదం ప్రకారం, పెరుగుకు చల్లని శక్తి ఉంటుంది. పెరుగు వంటి చల్లని, భారీ ఆహారాలు తీసుకోవడం వల్ల జీర్ణ శక్తి బలహీనపడుతుంది. ఇది ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. ఈ కారణంగానే పెరుగులో చిటికెడు నల్ల మిరియాలు, వేయించిన జీలకర్ర లేదా తేనె కలపమని ఎల్లప్పుడూ సలహా ఇస్తారు. ఎందుకంటే పెరుగులో ఏం కలపకుండా తినడం వల్ల జీర్ణ ప్రక్రియ మందగించవచ్చు.

**రోగనిరోధక శక్తిని ప్రభావితం చేస్తుంది**

ఆయుర్వేదం ప్రకారం, వర్షాకాలంలో పెరుగు వంటి చల్లని శక్తి ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి తగ్గుతుంది. చల్లని శక్తి ఉన్న ఆహారాన్ని అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో శ్లేష్మం అంటే కఫం ఏర్పడటం పెరుగుతుంది. ఇది పేగు ఆరోగ్యం మందగించడానికి దారి తీస్తుంది. దీంతో, జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధులు వస్తాయి. అంతేకాకుండా వివిధ రకాల అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది.

**శ్వాసకోశ సమస్యలు**

వర్షాకాలంలో క్రమం తప్పకుండా పెరుగు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం బాగా పెరుగుతుంది. ఇది ఛాతీలో పేరుకుపోయతుంది. దీంతో, జలుబు, దగ్గు వంటి శ్వాసకోస సమస్యలు వస్తాయి. అంతేకాకుండా శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది ఉంటుంది. వాతావరణంలో తేమ కారణంగా అనారోగ్యాలు, అలెర్జీలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

**సరైన మార్గం ఏంటి?**

ఆయుర్వేదం ప్రకారం వర్షాకాలంలో పెరుగు తినవచ్చు. అయితే, డైరెక్టుగా తినకూడదు. పెరుగు తినాలనుకుంటే చిటికెడు కాల్చిన జీలకర్ర పొడి, నల్ల మిరియాలు, నల్ల ఉప్పు లేదా తేనే కలిపి తినమని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇలా చేయడం వల్ల శక్తిని సమతుల్యం అవుతుంది. అంతేకాకుండా పేగు ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. జలుబు, దగ్గు వంటి శ్వాసకోస సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.





## ఆ పచ్చబొట్టు చాలా స్పెషల్

స్టార్ హీరోయిన్ సమంత గురించి ఎప్పటికప్పుడు ఏదో ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ వైరల్ అవుతూనే ఉంది. సమంత, నాగచైతన్య గురించి అయితే క్షణాల్లోనే సోషల్ మీడియా ఊగిపోతుంది. వీరిద్దరూ నటించిన మొదటి మూవీ ఏమాయ చేశావే. అది మంచి హిట్ కావడంతో దానికి గుర్తుగా సమంత తన వీపు మీద వైఎమ్ సీ అనే టాటూ వేయించుకుంది. వీరిద్దరూ విడాకులు తీసుకున్న తర్వాత దాన్ని చెరిపేసుకుందని వార్తలు వచ్చాయి. ఆ మధ్య ఓ వీడియోలో ఈ టాటూ కనిపించకపోవడంతో అంతా నిజమే అనుకున్నారు. కానీ సమంత ఆ టాటూను చెరిపేసుకోలేదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫొటోల్లో ఈ టాటూ కనిపిస్తోంది. అంటే విడాకులు తీసుకున్నా సరే.. తన సినిమాకు గుర్తుగా ఆమె అలాగే ఈ టాటూ ఉంచుకుంది. ఇది చూసిన సమంత ఫ్యాన్స్.. ఆమెకు సినిమాల పట్ల ఉన్న మమకారం అలాంటిది అంటూ చెబుతున్నారు. సమంత రీసెంట్ శుభం అనే సినిమాను నిర్మించింది. దాని తర్వాత వేరే సినిమా అప్డేట్ ఇవ్వలేదు. కానీ నందినిరెడ్డి డైరెక్షన్ లో హీరోయిన్ గా ఓ మూవీ చేస్తోందనే టాక్ నడుస్తోంది. ఇంకో వైపు డైరెక్టర్ రాజ్ నిడుమోరుతో కలిసి బయట తిరుగుతుండటంతో ఇద్దరూ డేటింగ్ లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. కానీ దానిపై క్లారిటీ ఇవ్వట్లేదు. మొత్తానికి సమంత చేస్తున్న పనులు నిత్యం మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నాయి. ఇప్పుడు టాటూ కనిపించేలా స్పెషల్ ఫొటో షూట్ చేయడం వెనక కారణం ఏంటని కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

## అన్నపూర్ణ'లో మెగా అనిల్!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఒక సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సంక్రాంతికి వస్తున్నాం లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సినిమా కావడంతో పాటు మెగాస్టార్ కామెడీ టైమింగ్‌కి అనిల్ రావిపూడి కరెక్ట్‌గా సూట్ అవుతాడని భావిస్తున్న నేపథ్యంలో ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే సినిమాలో నయనతార హీరోయిన్‌గా ఎంపిక చేసినప్పటి నుంచి సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేస్తున్నాడు అనిల్ రావిపూడి. ఇప్పటికే మూడు షెడ్యూల్స్ షూటింగ్ పూర్తి చేసిన ఆయన నాల్గవ షెడ్యూల్ అన్నపూర్ణ స్టూడియోలో ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. దాని కోసం ప్రత్యేకంగా ఒక సెట్ నిర్మించినట్లుగా తెలుస్తోంది. ఆగస్టు మొదటి వారంలో ఈ సినిమా షూటింగ్ మొదలు పెట్టబోతున్నారు. నిజానికి అనుకున్న షెడ్యూల్స్ ముందుగానే పూర్తి చేస్తూ షూటింగ్ శరవేగంగా పూర్తి చేస్తున్నాడు అనిల్ రావిపూడి. ఈ మధ్యనే మూడవ షెడ్యూల్ షూటింగ్ కేరళలోని అందమైన ప్రదేశాలలో జరిపారు. ఒక సాంగ్ షూట్ అక్కడ జరిపినట్లు తెలుస్తోంది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోలో మాత్రం టాకీ పార్ట్ షూట్ చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాని మెగాస్టార్ కుమార్తె సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో పాటు సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్ మీద నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.







## హిందీలో 'హరిహర వీరమల్లు'

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమా ఈ గురువారం నాడు రిలీజ్ అయింది. అయితే ఒక రోజు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శించగా సినిమాకి మిక్స్డ్ టాక్ వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో మొదలైన ఈ సినిమాని జ్యోతి కృష్ణ పూర్తి చేశారు. ఏఎం రత్నం సమర్పకుడిగా వ్యవహరించిన ఈ సినిమాని ఆయన బంధువు దయాకర్ రావు నిర్మించాడు. అయితే హరిహర వీరమల్లు సినిమా మొదలుపెట్టినప్పుడే ఫ్యాన్ ఇండియా సినిమాగా మొదలుపెట్టారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సినిమా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే చివరి నిమిషంలో హిందీ రిలీజ్ చేయలేదు. ఈ సినిమా హిందీ వర్షన్ రాబోతున్న శుక్రవారం నాడు రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. తాజాగా ఎన్టీవీకి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ ఇచ్చిన దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ విషయాన్ని వెల్లడించారు. అంతేకాక సినిమా గ్రాఫిక్స్ విషయంలో వస్తున్న కంప్లైంట్స్ గురించి ఆయన స్పందిస్తూ, సినిమా కథ లేదా ఇతర విషయాల మీద కంప్లైంట్స్ ఉంటే ఏమైనా చెప్పొచ్చు, అలాంటి వాటి మీద కంప్లైంట్స్ లేకపోవడంతోనే గ్రాఫిక్స్ బాలేదని మాట్లాడుతున్నారని ఆయన వెల్లడించారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో అనేకమంది నటీనటులు ఇతర కీలక పాత్రల లో నటించారు.

## 'మైసా' మొదలెడుతున్న రష్మిక

ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది రష్మిక. ప్రస్తుతం ఆమె చేతిలో చాలా సినిమాలు ఉన్నాయి. కొత్తగా మరో కొత్త సినిమా ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. ఆమె హీరోయిన్గా మైసా అనే సినిమా రేపు పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టు నుంచి రష్మిక ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో మంచి హైప్ క్రియేట్ అయింది. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా రక్తంతో ముఖం, చేతిలో ఆయుధం, ముక్కుపుడకతో ఆమె లుక్ చూసిన అంతా షాక్ అయ్యారు. 'ధైర్యం ఆమె బలం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి..' అంటూ ఇచ్చిన హైప్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక..'మైసా' అనే టైటిల్ అనౌన్స్ చేయగానే అందరిలోనూ ఓ ఆసక్తి నెలకొంది. అసలు మైసా అంటే ఏంటి? 'మైసా' అనే పదం వివిధ భాషల మూలాల నుంచి తీసుకున్నారు. స్వీడిష్, అరబిక్, జపనీస్, జార్జియన్ భాషల్లో 'మైసా' అనే పదానికి 'తల్లి' అని అర్థం. స్వేచ్ఛా భావాలతో, సహజ నాయకత్వంలో ముందుకు సాగిన ఓ సాహసవంతురాలి పాత్రకు ఇది సరైన టైటిల్ అని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక వారియర్ మదర్ గా కనిపించనున్నారు. గోండు తెగ నేపథ్యం ఆధారంగా ఈ కథ సాగనుంది. ఈ తెగల హక్కుల కోసం పోరాడే ఓ తల్లిగా, నాయకురాలిగా రష్మిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999